# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 09 సెప్టెంబరు, 2026 | పేజీలు : 08


## మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని కాంగ్రెస్ నేతలు పరామర్శ



**ప్రజాపక్షం/గజ్వేల్:** ఎర్రవల్లి ఫాంహౌజ్ సమీపంలో జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ తదితరులు మంగళవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు వారు సూచించారు. కాగా నర్సారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పిసిసి చీఫ్, మంత్రులు ఆసుపత్రి వైద్యుల నుండి ఆరా తీయగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వారు వివరించారు.

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న టీజీ టెట్–2026 ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న టీజీ టెట్–2026 ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లు, అభ్యర్థుల హాజరు, కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహణ, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఇనసర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న పరీక్షలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద కేంద్ర స్థాయి పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు.కాగా హనుమకొండ జిల్లా వ్యాప్తంగా రెండు షిఫ్టులలో కలిపి మొత్తం 2137 మంది అభ్యర్థులకు పరీక్ష కేటాయించగా, వారిలో 1961 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. 176 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని,జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం పర్యవేక్షణలో అన్ని కేంద్రాలలో ఈరోజు పరీక్ష ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంతరాలు లేకుండా సజావుగా కొనసాగినట్లు అలాగే బుధవారం కుడా ఈ పరీక్ష నిర్వహణ ఉంటుందని విద్యా శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట డీఈవో ఎల్. వి. గిరిరాజ్ గౌడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం డాక్టర్ బి. మన్మోహన్, బి. మహేష్, తదితరులు ఉన్నారు.



# దివ్యాంగులు సంకల్పంతో ముందుకెళ్ళాలి




### జిల్లా విద్యాశాఖ అధికారి సిద్దార్థరెడ్డి

**ప్రజాపక్షం/ములుగు:** జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం జిల్లా విద్యా శాఖ సమగ్ర శిక్ష, అలింకో వారి సంయుక్త సహకారంతో ములుగు భవిత కేంద్రం వద్ద ఉపకరణాల నిర్ధారణ శిభిరం సమగ్ర శిక్ష ఇంక్లూజివ్ ఎడ్యూకేషన్ కోఆర్డినేటట్ గుల్లపెల్లి సాంబయ్య అధ్యక్షతన నిర్వహించబడగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా విద్యా శాఖ అధికారి ఏ సిద్దార్థ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రాథమిక దశలోనే విద్యార్థులు వైకల్యాన్ని గుర్తించి తదనుగుణంగా చికిత్స అందించాలని ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అలింకో వారి సహకారంతో నిర్వహించడుతున్నటువంటి ఉపకరణాల నిర్ధారణ శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవడానికి విచ్చేసిన తల్లి దండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వైకల్యం కలిగిన పిల్లలను నిరుత్సాహపడకుండా తల్లి దండ్రులు వారిని ప్రోత్సహించాలని, విద్యార్థులు సంకల్పంతో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ సైకం శ్రీనివాస్‌రెడ్డి, అలింకో నుండి హాజరైన డాక్టర్ రజిత్ రెడ్డిలతో పాటుగా జిల్లాలోని స్పెషల్ ఎడ్యుకేసన్ టీచర్లు, ఐఈఆర్‌పిలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు.

# సిద్దిపేటలో కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/సిద్దిపేట:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మదు నవీన్ కుమార్ రెడ్డి లు నీచంగా, సంస్కృతి హీనంగా మాట్లాడినందుకు వెంటనే బీఆరెస్ ఎమ్మెల్సీలు తాతా మధును నవీన్ కుమార్ రెడ్డి ను బర్తరఫ్ చేయాలి అని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేటలో రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మదు నవీన్ కుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఎస్సీ సెల్ నాయకులు బొమ్మల యాదగిరి ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు దగ్దం చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ , పట్టణఅద్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని అవమానించేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్దం అని అన్నారు. రాజకీయంగా విభేదాలు ఉండవచ్చు అని అయితే వ్యక్తిగతంగా కుటుంబ సభ్యులను ఉద్దేశించి పరుష వ్యాఖ్యలు చేయడం సరికాదు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిని దూషించడం చాలా భాధాకరం అన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు క్షమాపణ చెప్పాలి అని అన్నారు. ఒక భాద్యతమైన పదవిలో ఉండి అలా నీచంగా హీనంగా మాట్లాడాటం సిగ్గుచేటు అని అన్నారు. దళితులు అంటే బీఅరెస్ పార్టీకి నాయకులకు చిన్నచూపు అని ఉద్యమం నుంచి ప్రభుత్వ ఏర్పాటైన తరువాత దళితులను అవమానించి కించపరిచిన దళిత ద్రోహుడు కెసిఆర్ అని అన్నారు. బీఅరెస్ ను ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన సిగ్గురాలేదు అని ఫామ్ హౌస్ లో కూర్చొని కెసిఆర్ చిల్లర రాజకీయాలు చేస్తున్నాడు అని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరగకుండా బిఆరెస్ కావాలని అడ్డుకుంటుంది అని అన్నారు. స్పీకర్ ను దూషించిన ఎమ్మెల్సీలు తాతా మధును నవీన్ కుమార్ రెడ్డి లపై కఠిన శిక్ష విధించేలా పోలీసులు కేసు నమోదు చేయాలి అని అన్నారు. పనికిమాలిన నాయకుడు అవినీతిపరుడు కెసిఆర్ కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారు అని అధికారం కోసం కెసిఆర్ కెటిఆర్ హరీష్ రావు నీచ రాజకీయాలు చేస్తున్నారు అని మీరు చేస్తున్న దొంగ్రాములు కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గంప మహేందర్ రావు. బొమ్మల యాదగిరి. ముద్దం లక్ష్మి దాస అంజయ్య కలిముద్దీన్ రాశాద గయాజుద్దీన్ విజయ్ డానియల్ వహాబ్ సంతోషి బర్మా రామచంద్ర రాములు రాజ్ బహదూర్ రెడ్డి వంశీ. సనా రజినీ లహరి దస్తగీర్ దేశెట్టినరేష్ పవన్ చందు శ్రీనివాస్ కర్ణాకర్ రఘుపతి అనిల్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.



## 10న ఛలో హైదరాబాద్



ప్రజాపక్షం/వాజేడు: ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10 న నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వాజేడు మండల జేఏసీ కన్వీనర్ స్వరూప్‌సింగ్ పిలుపునిచ్చారు. మంగళవారం వాజేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూప్ సింగ్ మాట్లాడుతూప్రభుత్వం ఉద్యోగులకు పెండింగ్ ఉన్న పిఆర్సీ, ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ ఉద్యోగులందరిని ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు. సెప్టెంబర్ 10 న నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయవల్సిందిగా కోరారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులుఇ కంచు ప్రభాకర్, రామన్న తో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్పీకర్‌ను అవమానిస్తే సహించం

ప్రజాపక్షం/ములుగు: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎంఎల్‌సి తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ వెంకటాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. అసభ్య పదజాలంతో దూషించడం బిఆర్ఎస్ నేతల అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే ఒక వ్యక్తిని కాదని, రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. పార్టీ నేతగా కెసిఆర్ కూడా బయటకు వచ్చి ఈ వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధు క్షమాపణ చెప్పాలి

ప్రజాపక్షం/వెంకటాపురం(నూగురు): స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వాఖ్యలపై దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిట్యాల సాగర్ డిమాండ్ చేశారు. దొరల అహంకారం నిరంకుశ దోరణితో చేసిన వాఖ్యలు ఏ మాత్రం అమోదయోగ్యం కాదని వెంటనే తాతా మధు పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను అందించాలి

ప్రజాపక్షం/హసన్‌పర్తి: ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వ్యాక్సిన్ గది, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ గది, సిబ్బంది గది, నర్సుల గది, ఇంజక్షన్ రూమ్, ల్యాబొరేటరీ, ఫార్మసీ, టాయిలెట్స్, తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను కలిసి వారు ఏ సమస్యతో వైద్య సేవల కోసం వచ్చారో కలెక్టర్ ఆరా తీశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది స్పందన,తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలతో పాటు నిర్వహణ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులు,సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది అందుబాటులో ఉండేలా షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించాలని, ప్రతి షిఫ్ట్‌లో అవసరమైన సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండేలా పర్యవేక్షించాలని వైద్యాధికారిని ఆదేశించారు. హాస్పిటల్ నిర్వహణ పక్కాగా ఉండాలని,రోగులకు మెరుగైన వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూరి



ప్రజాపక్షం/హసన్ పర్తి : నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో నిర్మిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని ఎన్ని రోజుల్లోగా పూర్తిచేయగలరనే విషయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.డిస్ట్రిబ్యూషన్ లైన్ల పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ఈ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్ల నిర్మాణంలోనాణ్యతాప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో ఉపయోగిస్తున్న నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఈఈ బి. గాయత్రీ, గ్రిడ్ ఈఈ రామాంజనేయులు, డీఈలు శ్రీనివాస్, జట్టి శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమనవాణి, ఏఈలు అనిల్, నీరజ, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మలేషియా అంతర్జాతీయ సదస్సుకు ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్


OSMANIA UNIVERSITY
HYDERABAD
DEPUTY REGISTRAR
(Administration)



ప్రజాపక్షం/గోవిందరావుపేట: పసర గ్రామానికి చెందిన ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్ అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గుర్తింపు సాధించారు ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఫిజిక్స్ గా సేవలందిస్తున్న ఆయన మలేషియాలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 9వ అంతర్జాతీయ ఆవిష్కరణలు సాంకేతిక పారిశ్రామికవేత్తల సదస్సు 2026కు హాజరవుతున్నారు కృతిమ మేధస్సు మరియు పారిశ్రామిక అనువర్తనాల అభివృద్ధి అనే ప్రధాన అంశంతో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాలకు చెందిన విద్యావేత్తలు శాస్త్రవేత్తలు పరిశోధకులు నిపుణులు పాల్గొంటున్నారు పసర గ్రామం నుంచి ప్రారంభమైన ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్ విద్యా ప్రస్థానం నేడు అంతర్జాతీయ సదస్సు వేదిక వరకు చేరుకోవడం గ్రామ ప్రజలకు ఎంతో గర్వకారణంగా నిలిచింది ఆయన సాధించిన ఈ ఘనత విద్యార్థులు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు సెప్టెంబర్ 10నుంచి 18వ తేదీ వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్న ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్‌కు ఉపాధ్యాయులు ఆధ్యాపకులు పరిశోధకులు విద్యార్థులు పసర గ్రామ ప్రజలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఆయన మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## మట్టి వినాయకుడిని ప్రతిష్టించాలి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారుచేసిన విగ్రహాలను ఉపయోగించడం వల్ల నీటి వనరులు, పర్యావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రకృతిని కాపాడుతూ, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలి అని ఆయన పిలుపునిచ్చారు. మట్టితో తయారైన వినాయక విగ్రహాలు పర్యావరణహితమైనవని, నిమజ్జనం అనంతరం ప్రకృతిలో సులభంగా కలిసిపోతాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో హనుమకొండ నగరంలో శని, ఆదివారాల్లో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని అనేక స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ తెలిపారు.మట్టి వినాయక విగ్రహాలు కావాలనుకునే వారు లేదా ఆ పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను తెలుసుకోవాలనుకునే వారు 9949709866 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన తెలిపారు.

## కడియం శ్రీహరికి దళితులపై నిజమైన ప్రేమ లేదు



హనుమకొండ టౌన్ : కడియం శ్రీహరికి దళితులపై నిజమైన ప్రేమ లేదని, తన కుమార్తె పదవి కోసమే దళితులపై ప్రేమ ఉన్నట్లు కపట నాటకాలు ఆడుతున్నారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు.మంగళవారం హనుమకొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన దాస్యం వినయ్ భాస్కర్.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడియం శ్రీహరికి రాజకీయ భిక్ష పెట్టింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. అలాంటి కేసీఆర్కు దళితులపై ప్రేమ లేదని కడియం శ్రీహరి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నడూ లేని విధంగా హౌస్ అరెస్టులు జరుగుతున్నాయని ఆరోపించారు.

## పేరెంట్స్‌ల ముందే టీచర్ల రభస

ప్రజాపక్షం/నడికూడ: సమాజంలో గౌరవప్రదమైన వృత్తిగా భావించే ఉపాధ్యాయ వృత్తికి మచ్చ తెచ్చేలా నడికూడ మండలం వరికోలు ప్రాథమిక పాఠశాలలో ఘటన చోటుచేసుకుంది.పీఎం శ్రీ పథకం నిధుల ఖర్చుపై విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు పరస్పరం వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.తల్లిదండ్రుల సమక్షంలోనే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ గొడవకు దిగడం చర్చనీయాంశంగా మారింది.పీఎం శ్రీ నిధుల ఖర్చుపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి గ్రామ సర్పంచ్,పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా,తమకు అనుకూలంగా ఉన్న కొందరు తల్లిదండ్రులను మాత్రమే పిలిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సమావేశంలో నిధుల వినియోగం,పంపకాల అంశంపై ఉపాధ్యాయుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు తెలిసింది.పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఫోర్జరీ సంతకాలతో నిధులు దుర్వినియోగం చేశారంటూ కొందరు ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు, మండల,జిల్లా విద్యాధికారులకు గతంలో ఫిర్యాదులు అందినట్లు సమాచారం.పాఠశాల నిధుల వినియోగంపై నెలకొన్న వివాదంపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## అశోక్ జ్ఞాపకార్థం అన్నదానం

ప్రజాపక్షం/వెంకటాపూర్ : లక్ష్మీ దేవి పేట గ్రామానికి చెందిన దుర్గం అశోక్ మరణించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అశోక్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదేవిధంగా స్థానిక అమరావతి విద్యాలయంలో అశోక్ భార్య సౌజన్య, కుమార్తె అవని, కుమారుడు రాహుల్ చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్, ఉపసర్పంచ్ కొండ తిరుపతి,హైస్కూల్ హెచ్ఎం బండి సురేష్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం సూత్రాల రవి, ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, స్వర్ణ, దీప్తి, సలేంద్రం, సోనాలిక తదితరులు పాల్గొన్నారు.

## 10న చలో ఐటిడిఎ ముట్టడి

ప్రజాపక్షం/భూపాలపల్లి : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 10 న ములుగు జిల్లా లోని ఐటీడీఏ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు స్మరణ, కుమ్మరి రాజు లు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్టీ హాస్టల్స్ అదేవిధంగా ఆశ్రమ హాస్టల్స్ దాంతోపాటు పీఎంహెచ్ హాస్టల్స్ లోని విద్యార్థిని విద్యార్థుల యొక్క సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎస్టీ హాస్టల్స్ విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలైన బాత్రూమ్స్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సదుపాయాలు లేకపోవడం వల్ల అనేకమైన ఇబ్బందులు ఎదుర్కొన్నటువంటి పరిస్థితి ఉంది ఇది ఇలా ఉంటే దాంతోపాటు ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్నటువంటి టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాల్సిందిగా వారు డిమాండ్ చేశారు. 10న జరిగే చలో ఐటిడిఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా రాజకుమార్ స్మరణ డిమాండ్ చేశారు.

## సన్నరకాల పంట నమోదుకు 10 చివరి తేదీ

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** వానాకాలం సీజన్‌కు సంబంధించి సన్న రకాల వరి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీబాబు రైతులకు సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా గ్రామాలలో పంటల నమోదును వ్యవసాయ శాఖ చేపడుతుందన్నారు. తెలంగాణ సోనా, బీపీటీ 5204, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, జై శ్రీరామ్, కేఎన్ఎం 7715, తదితర సన్న రకాలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలన్నారు. ఎరువుల దుకాణాల ద్వారా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ వద్ద సీడ్ కార్పోరేషన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, సొంత విత్తనాలు వినియోగించిన వారు కొనుగోలు రశీదు, పట్టాదార్ పాస్‌బుక్‌తో ఏఈవోను సంప్రదించాలన్నారు. సెప్టెంబర్ 10న చివరి తేదీ అని, గడువులోగా నమోదు చేసుంచుకోని రైతులకు సన్న వడ్ల బోనస్ వర్తించదని స్పష్టం చేశారు. నమోదు చేసిన రైతుల జాబితాను 9న గ్రామ పంచాయితీల వద్ద ప్రదర్శిస్తామని తెలిపారు.

## తాత మధుసూదన్ వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి

**ప్రజాపక్షం/మంగపేట:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మంగపేట మండల కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలను తాత మధుసూదన్ బేషరతుగా వెంటనే వెనక్కి తీసుకోవాలని,ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈ వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తాత మధుసూదన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** సెప్టెంబర్ 10 నుండి 17 వరకు నిర్వహించే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కామారెడ్డిడెంలో సీపీఎం మండల కమిటి సమావేశం రెడ్డి రాజుల నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రమేష్ మాట్లాడుతూ ఆనాడు దొరలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పేదలు, రైతులు సాగించిన పోరాటమే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. పోరాట చరిత్రను ప్రజలకు వాస్తవ రూపంలో తెలియజేయడమే వారోత్సవాల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉప్పలయ్య, మైసయ్య, శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే తక్షణమే ప్రభుత్వం నుంచి తప్పుకోవాలని మాజీ ఎంపీ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు.బిఆర్ఎస్ పార్టీ ఎనిమిది రోజుల నిరసన కార్యక్రమాలలో భాగంగా ముగింపు రోజు అయిన మంగళవారం వరంగల్ నగర పరిధిలోని కాశీబుగ్గ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి వినోద్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ తప్పుడు గ్యారెంటీ కార్డులతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అనేక తప్పుడు హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం త్వరలోనే చెల్లించుకోవాల్సి వస్తుందని వినోద్ కుమార్ పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు తులం బంగారం ఉచితంగా ఇస్తామని, నగదు డబ్బులు ఇస్తామని, రైతు భరోసా పెంచుతామని, నిరుద్యోగ భృతి ఇస్తామని, ఆటో కార్మికులకు ఆర్థిక సాయం చేస్తామని అంటూ అనేక మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రాగానే ఇప్పటివరకు ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని వినోద్ కుమార్ ఆరోపించారు. రానున్న రోజుల్లో క్యాబినెట్ నుంచి ఇంకా ఎంతమంది ఉంటారు ఎంతమంది పోతారో అని బయట గుసగుసలు వినిపిస్తున్నాయని, ముందు క్యాబినెట్ సహచరులను, ఎమ్మెల్యేలను దగ్గర ఉంచుకొని ఉన్న రెండేళ్ల పాటు పదవిని అనుభవించి మంచి పాలనను అందించాలని, హామీలను అమలు చేయాలని వినోద్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు.

## వాడివేడిగా మున్సిపల్ సమావేశం



**ప్రజాపక్షం/జనగామ :** జనగామ మున్సిపల్ సమావేశం మంగళవారం వాడివేడిగా జరిగింది. అభివృద్ధి కార్యక్రమాలపై బిఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఛైర్మన్‌పై బిఆర్ఎస్ కౌన్సిలర్ సుగుణాకర్ చేసిన ఆరోపనలపై కాంగ్రెస్ నాయకులు మండిపడి ప్లేకార్డులు ప్రదర్శించారు. ఇలా సుమారు గంటలకు పైగా గొడవ జరిగింది. చివరకు బిఆర్ఎస్ కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. 44 అంశాలు ఎజెండాలో పెట్టగా 43 అంశాల్ని ఏకగ్రీవంగా అమోదించారు. అనంతరం ఛైర్ పర్సన్ మీడియా సమావేశం నిర్వయించారు.

జనగామలో అభివృద్ధి కొనసాగుతుంది : ఛైర్ పర్సన్

జనగామ పట్టణంలో అభివృద్ధి కొనసాగుతుందని మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమణి అన్నారు. మంగళవారం మున్సిపల్‌లో విలేకర్లతో మాట్లాడుతూ వార్డుకు ఐదు లక్షల చొప్పున అభివృద్ధిపనులు జరుగుతున్నాయని, పారిశుద్య పనులపై దృష్టి పెట్టామని, ఇప్పటికే మురుగు కాల్వలు పూర్తి స్థాయిలో శుభ్రం చేయడం జరిగిందన్నారు. దోమల మందు పిచుకారి చేయడంతో పాటు నివారణకు చర్యలు చేపట్టామని, కోతల్ని పట్టుకొని తరలించడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం అమలు చేస్తున్నామని వివరించారు. మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు చెంచారపు కరుణాకర్‌రెడ్డి, రామగల్ల విజయ, మిద్దెపాక భాస్కర్, నానితో పాటు పలువురు పాల్గొన్నారు.

## జనగామ పురపాలక కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/జనగామ:** మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జనగామ పురపాలక కౌన్సిల్ సాధారణ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అజెండాలోని 44 అంశాలలో రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, నీటి సరఫరా లీకేజీలు, వీధి దీపాల మరమ్మత్తులు, దసరా బతుకమ్మ పండుగల నిర్వహణ, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రమాద భీమా, ఆక్రమణల తొలగింపు సహా మొత్తం 43 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఒక అంశాన్ని తిరస్కరించింది. మున్సిపల్ వాట్సాప్ గ్రూప్‌లో చైర్‌పర్సన్, కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు 18వ వార్డు కౌన్సిలర్ గోపగోని సుగుణాకర్‌ను తెంగాణ మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం 8వ కౌన్సిల్ సమావేశం వరకు సస్పెండ్ చేస్తూ చైర్‌పర్సన ఉత్తర్వులు జారీ చేశారు. వివరణ కోరినా సహకరించకుండా సమావేశానికి ఆటంకం కలిగించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ సీహెచ్ రాజశేఖర్, కౌన్సిలర్లు, పురపాలక అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థికి కాళోజీ అవార్డును ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** సెప్టెంబర్ 09 కాళోజీ జయంతి సందర్భంగా ప్రతియేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి కాళోజీ పురస్కారాన్ని ఈ సంవత్సరంకు గాను ప్రముఖ కవి, కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి విఆర్ విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రేపు హైదరాబాదు, రవీంద్రబాదులో జరగబోయే కాళోజీ జయంతి వేడుకలలో విద్యార్థి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఐదు దశాబ్దాల నుండి తెలుగు సాహిత్యంలో వి ఆర్ విద్యార్థి గారు విశేష కృషిని అందిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కవిత్వాన్ని అందించి ఎందరో సాహితీవేత్తల ప్రశంసలను పొందారు. ఇండియన్ ఎయిర్ ఫోర్సులో పనిచేస్తూ రెండు యుద్ధాలలో (1965, 1971) పాల్గొన్న సైనిక కవిగా పేరు పొందారు. కాళోజి సోదరులకు అత్యంత సన్నిహితుడిగా మెదిలిన విద్యార్థి కాళోజీ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శిగా, ప్రస్తుతం మిత్ర మండలి కన్వీనర్ గా కొనసాగుతున్నారు. వీరు అలలు, పలకరింత, ఘర్మ సముద్రం, మంచు మైదానం, ఖండాంతర కవిత్వం, ఇతర కవితలు, దృశ్యం నుండి దృశ్యానికి తదితర కవితా సంపుటాలతో పాటుగా ఓరుగల్లు చేవ్రాలు(పీఠికలు), దక్కన్ దస్తూరి (సాహిత్య వ్యాసాలు) లాంటి పుస్తకాలను వెలువరించారు. వీరి కవిత్వం సమాలోచనపై అద్దంలో విద్యార్థి మరియు వారి కవితా సంపుటాలన్నీ కలిసి విద్యార్థి కవితా సర్వస్వం పేరుతో పుస్తకాలు అచ్చయ్యాయి.ఈ సందర్భంగా విద్యార్థికి అవార్డు రావడం పట్ల కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, నాగిళ్ళ రామశాస్త్రి, డాక్టర్ బన్న అయిలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్ల మహేందర్, వల్లంపట్ల నాగేశ్వరావు, నెల్లుట్ల రమాదేవి, నిధి, రామాచంద్రమౌళి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## గొర్రెలు, మేకల షెడ్ల వివాదంపై 87 మందికి బైండోవర్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** కొడవటూర్ గ్రామంలో బర్రెలు, మేకల షెడ్ల విషయంలో కుర్మ కులస్థులకు చెందిన రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న వివాదంపై పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇరు వర్గాలకు చెందిన 87 మందిని ఎంఆర్‌వో సమక్షంలో బైండోవర్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వివాదాలను చట్టపరమైన మార్గాలలో పరిష్కరించుకోవాలని, ఎవరు చట్టాన్ని చేతలలోకి తీసుకోవద్దని సూచించారు. ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## కెజిబివికి అదనపు తరగతి గదులు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** దేవరుప్పుల కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.56లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి సందీప్ కుమార్ ఝా పరిపాలన అనుమతులు జారీ చేశారు. ఇటీవల పాఠశాల సందర్శన సందర్భంగా విద్యార్థినులు తరగతి గదుల కొరతకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న మొదటి అంతస్తు ఎడమ, వెనుక భాగంలోని గదులను పక్కా నిర్మాణంగా పూర్తి చేయనున్నారు. పనులను తక్షణమే ప్రారంభించి నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కూనూరు విద్యార్థులు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జిల్లా స్థాయి యోగా పోటీలలో కూనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 8వ తరగతికి చెందిన ఆర్ శరత్, డి ప్రణతి, 6వ తరగతి విద్యార్థులు కె రిషి, కె ప్రిన్సి ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10, 11వ తేదీలలో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొననున్నారు. విజేతలకు హెచ్ఎం మహ్మద్ పర్వాజ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. వీరి ఎంపికకకు సహకరించిన జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపు రాజేంద్రం, కార్యదర్శి సాంబరాజులకు హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు.

## బిసి కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మికి డాక్టరేట్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. ఓయూ 85వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళా సాధికారతపై సామాజిక చట్టపరమైన అధ్యయనం అంశంపై ఆమె పరిశోధన చేశారు. రాజకీయాలలో మహిళల భాగస్వామ్యం, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళా సాధికారతకు అవసరమైన చట్టాలు, నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యంతో సమాజంలో వచ్చే మార్పులపై పరిశోధన సాగించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి జైలు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ జనగామ అడ్మిన్ కోర్టు జడ్జి సందీప నిర్ణయం వెలువరించారు. దేవరుప్పులకు చెందిన బగ్గాల నరసింహారెడ్డి, వడ్లకొండకు చెందిన మారబోయిన రాజు, సాయిగూడెంకు చెందిన ఇంజు రాజుపై నమోదైన కేసుల్లో ఈ శిక్ష విధించారు. మొత్తం 12 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.1.20లక్షల జరిమానా కూడా విధించినట్లు పోలీసులు తెలిపారు.

## 10న ఉద్యోగుల చలో హైదరాబాద్

**ప్రజాపక్షం/పాలకుర్తి:** ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ నెల 10న హైధరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించు ఛలో హైధరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకుర్తి ఎంపీడీవో కార్యాలయం ముందు టీఎన్జీవో పాలకుర్తి యూనిట్ అధ్యక్షులు బక్క మహేష్, పంచాయితి కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు రొండ్ల శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల కోసం చేపట్టిన ఛలో హైధరాబాద్ కార్యక్రమానికి పాలకుర్తి యూనిట్ పరిధిలోని ఉద్యోగులు అందరు స్వచ్ఛందంగా తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, వరుణ్, అనురాధ, నాగరాజు, శరత్, సతీష్, అశోక్, పాల్గొన్నారు.

# 52 ఫీట్ రోడ్డు వెడల్పు 48 ఫీట్లకు తగ్గింపు..



ప్రజాపక్షం/గణపురం: గణపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుండి కోటగుళ్ల వైపుకు వెళ్లే రోడ్డు వెడల్పు 48 ఫీట్లుగా తీర్మాణించినట్లు గణపురం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణరావు నిధులు కేటాయించగా ఇటీవల పనులు ప్రారంభించారు. దీనితో అధికారులు రోడ్డు వెడల్పు 52 ఫీట్లుగా నిర్ధారించడంతో రోడ్డు వెంట ఉన్న దుకాణ సముదాయలు, గృహ సముదాయాల యజమానులు భూపాలపల్లి ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణరావును కలిసి తమగోడు వెళ్లబోసుకున్నారు. దీనితో ఆయన అధికారులతో మాట్లాడి 48 ఫీట్లు ఖరారు చేశారు. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రోడ్డు వెడల్పు అంశంపై గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో రోడ్డు వెడల్పును 48 ఫీట్లకు తగ్గిస్తున్నట్లు సర్పంచ్ రాధిక వె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణగౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ సిఐని కలిసిన స్వచ్ఛంద సంస్థల సభ్యులు

ప్రజాపక్షం/నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కొత్తగా విధుల్లో చేరిన సిఐ జయశ్రీని వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థల సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకగా కలిశారు. అనంతరం బొకెను అందించారు. ఈసందర్భంగా స్వచ్ఛంద సంస్థల బాధ్యులు మాట్లాడుతూ డివిజన్‌లో జరుగుతున్న అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణపై, అధిక ధరలపై, మద్యం షాపుల ముందు రోడ్డు ట్రాఫిక్ జామ్ గురించి, డివిజన్‌లో విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్న గంజాయి మహమ్మారిపై యువకులు, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతిస్తున్న డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార కేంద్రం అధ్యక్షుడు గిరిగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బెజ్జంకిప్రభాకర్, ఎస్సీ ఎస్టీ కన్వీనర్ బోయిన వెంకట్ స్వామి, కాసుల వెంకటాచారి, వెంకట్రాం నర్సయ్య తదితరులు పాల్గొని వినతి పత్రం అందించారు.

# నెక్కొండ తండాకు కొత్త విద్యుత్ స్తంభాలు

ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ తండా విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. తండాలో నెలకొన్న లోవోల్టేజ్, తరచూ విద్యుత్ అంతరాయం, పాత స్తంభాల సమస్యలను సర్పంచ్ బానోత్ రవి కుమార్, ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంఎల్ఎ విద్యుత్ శా ఖ అధికారులతో మాట్లాడి నూతన విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించారు. మంజూరైన స్తంభాలు మంగళవారం తండాకు చేరుకున్నాయి. నూతన స్తంభాల మంజూరుతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించనుండడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి, సర్పంచ్ బానోత్ రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# తాతా మధుపై చర్యలు తీసుకోవాలి

స్పీకర్ పదవిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదు
యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లాగౌడ్



ప్రజాపక్షం/ఖానాపురం: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బిఆర్ఎస్ ఎంఎల్‌సి తాతా మధు చేసిన వ్యాఖ్యలను యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లాగౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నిలిచే శాసన సభ స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎల్లాగౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలను కించపరిచడమేనన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయని, పదవుల గౌరవాన్ని దిగజార్చే విధంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు, తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతిపక్ష నేతలు గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. అధికారం కోల్పోయిన అసహనంతో ఇష్టానుసారంగా మాట్లాడడం బిఆర్ఎస్ నాయకులకు తగదని విమర్శించారు.శాసన సభ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపైన ఉందని ఎల్లాగౌడ్ అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతమైతే కాంగ్రెస్ పార్టీ యువత ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలపై సంబంధిత పార్టీ నాయకత్వంలో స్పందించిన తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# అసభ్య పదజాలంపై కవి రాపాక శ్రీనివాస్ కవితా నిరసన

ప్రజాపక్షం/నెక్కొండ: ప్రజా వేదికలపై హుందాతనాన్ని పక్కనపెట్టి అసభ్య పదజాలంతో మాట్లాడడం తెలంగాణ సంస్కృతిని అవమానించడమేనని మండల కేంద్రానికి చెందిన సహజ కవి రాపాక శ్రీనివాస్ తన తాజా కవిత ద్వారా ప్రశ్నించారు. రాజకీయ వేదికలపై పరస్పర విమర్శలు హద్దులు దాటుతున్న నేపథ్యంలో ఆయన రాసిన 'నువు అన్న ఆ అమ్మకు కోపం వస్తే..' కవిత సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. సంస్కారవంతమైన మాటలతో ప్రజల మనసులు గెలుచుకోవడం చేతకాక, బూతు పదజాలాన్ని ఆశ్రయించడం ఒక ఫ్యాషన్‌గా మారిందని కవి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల మాటల్లోని ఆత్మీయత, మర్యాద, సంస్కారాన్ని గుర్తు చేస్తూ...అసభ్య పదజాలంతో తెలంగాణ తల్లి నలుగురిలో నగుబాటుకు గురవుతోందని కవితలో ఆవేదన వ్యక్తం చేశారు. 'బాగున్నావా బిడ్డా' అని పలకరించేంత అప్యాయత కలిగిన తెలంగాణ భాషను తిట్ల పురాణంగా మార్చడం తగదని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారు తమ పదవులకు ప్రజలు ఇచ్చే గౌరవాన్ని గుర్తించి, అదే గౌరవాన్ని ప్రజలకు కూడా ఇవ్వాలని సూచించారు. ఎవరినైనా విమర్శించే ముందు మాటల స్థాయిని, సంస్కారాన్ని గుర్తుంచుకోవాలని కవి రాపాక శ్రీనివాస్ తన కవిత ద్వారా హితవు పలికారు. ప్రజా వేదికలు సమస్యలపై చర్చించే వేదికలుగా ఉండాలే తప్ప వ్యక్తిగత దూషణలకు కేంద్రాలుగా మారకూడదనే సందేశాన్ని కవిత అందిస్తోంది.

# సిఎం, ఎంఎల్ఎల క్రిమినల్ కేసు నమోదు చేయాలి

బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మోతే కరుణాకర్‌రెడ్డి




ప్రజాపక్షం/గణపురం: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావుపై బహిరంగంగా మరణాన్ని కోరుతూ హింస చేయడానికి ప్రేరేపించేలా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో షాద్‌నగర్ ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ కుట్రదారులపై భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ 2023లోని సెక్షన్లు 196, 351(3), 352, 353, 61 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ గణపురం పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్ఓ)కి గణపురం మండల పార్టీ అధ్యక్షుడు మోతే కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పిర్యాధు చేశారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ప్రతిపక్ష నేతకు, బెదిరింపులు హింసకు ప్రేరేపించే చర్యలు నుండి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, సెప్టెంబర్ 8న షాద్‌నగర్ ఎంఎల్ఎ శంకర్ చేసిన వ్యాఖ్యలు ఆర్ టివి తెలుగు ద్వారా ఉచితంగా ప్రచారం కావడంతో పాటు సోషల్ మీడియాలో కూడా ప్రచారంలో ఉన్నాయి. కేసిఆర్ నివాసం వెలుపల వెయ్యి డప్పులతో ర్యాలీ ఎందుకు నిర్వహిస్తున్నారని ఆయనను ప్రశ్నించగా ఆయన మీడియాతో ఇలా చెప్పారు. కెసిఆర్ ఈ రాష్ట్రానికి పట్టిన పీడ అందుకే అతని చావును కోరుకుంటున్నామన్న మాటలను పరిగణలోకి తీసుకుని అతనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జులై 2026న కొల్లాపూర్ వేదికగా, 2025లో ప్రతిపక్ష నేతపై హింసకు ప్రేరేపించే విధంగా మాట్లాడిన విధానాలను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎంఎల్ఎ శంకరయ్య, ఇతర కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాకర్ రెడ్డి వెంట బిఆర్ఎస్ నాయకులు లక్ష్మీ నరసింహారావు, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, ఉడుత సాంబయ్య, పేరాల దేవేందర్ రావు, వాజిద్, మోటం సింహాచలం, రత్న నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల చట్టం అమలు చేయాలి

జాతీయ సదస్సులో దక్షిణాది రాష్ట్రాల సమైక్య చైర్మన్ మొగిలిచర్ల సుదర్శన్




ప్రజాపక్షం/ఖిలా వరంగల్: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టాలను అన్ని రాష్ట్రాల్లో పకడ్బందీగా అమలు చేయాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమైక్య చైర్మన్ మొగిలిచర్ల సుదర్శన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు మహారాష్ట్రలోని విదర్భ జిల్లా మహాత్మాగాంధీ కుటీరంలో మంగళవారం నిర్వహించిన జాతీయ వినియోగదారుల సమాఖ్య సదస్సులో ఆయన ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని ప్రసంగించారు. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో వినియోగదారుల చట్టం అమలు తీరుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వినియోగదారుల రక్షణ చట్టం...1986 ప్రకారం మండల, తాలూకా, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఫుడ్ అడ్వైజరీ, వినియోగదారుల పరిరక్షణ మండళ్లు, ధరల నియంత్రణ కమిటీల ద్వారా సమస్యలను చర్చించేందుకు అధికారిక వేదికలు ఉండేవని తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, వ్యాపార ప్రతినిధులు సమావేశమై సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను సూచించేవారని పేర్కొన్నారు. జాతీయ చైర్మన్ విశ్వాశ్ శేనోయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ నాయకులు దేవేంద్ర తివారి, విజయ్ బైస్, మాధురి చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కాశిబుగ్గ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. వరంగల్ తూర్పు మాజీ ఎంఎల్ఎ నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ వెయ్యి రోజులు పూర్తయిన ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, చైర్‌పర్సన్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, బూత్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/ఖానాపురం: అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకున్న ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను మంగళవారం ఖానాపురం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. నర్సంపేట ఏఎంసీ చైర్మన్, ఖానాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు చేతుల మీదుగా లబ్ధిదారులు చెక్కులను అందుకున్నారు. ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. కోరీటాల వెంకటేశ్వర్లుకు రూ.26,500, చూడి ప్రతాపరెడ్డికి రూ.60వేలు, సుమాలికి రూ.54 వేలు, వి వెంకటేశ్వర్లుకు రూ. 24వేల చొప్పున చెక్కులు అందజేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆత్మ చైర్మన్ ఎద్ల బిక్షంరెడ్డి, వార్డు సభ్యులు శాఖమూరి ముకేశ్, ఎలికంటి మల్లికార్జున్, కందుల రమ, తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం చేసిన వ్యక్తి సేవాభావం అభినందనీయం



ప్రజాపక్షం/నల్లబెల్లి: మరణానంతరం నేత్రదానం చేసి ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి పిట్టల సిరివెన్నెల సేవలను అభినందిస్తూ నల్లబెల్లిలో సంస్మరణ సభ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులను తల్లిదండ్రులు పిట్టల రజిత రమేశ్ లను ఘనంగా సన్మానించి, వారి సేవాభావాన్ని కొనియాడారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా నల్లబెల్లి ఎస్ఐ ఎం. సాయి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మరణం అనంతరం కూడా ఇతరులకు చూపును అందించడం గొప్ప మానవతా సేవ అని అన్నారు. నేత్రదానం తో చూపు కోల్పోయిన వారికి కొత్త జీవితాన్ని అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ చల్ల గురువుల చలపతి( దళపతి ) హన్మకొండ జిల్లా అధ్యక్షులు కే.శంకరరావు , వరంగల్ జిల్లా కార్యదర్శి గోవింద్ కుమారస్వామి , బి సి సంక్షేమ వరంగల్ జిల్లా అధ్యక్షులు ద్యా గాల శ్రీనివాస్,ఆకుల సుభాష్ భూపాలపల్లి ముదిరాజు సంఘం జిల్లా అధ్యక్షులు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

ప్రజాపక్షం/గణపురం: గణపురం మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి మోహన్‌కు చెందిన పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మేతకు వెళ్ళిన పాడి ఆవు ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్ళగా మెయిన్ లైన్ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు 50వేల విలువచేసే పాడి ఆవు మృతి చెందడంతో మోహన్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబోమ్మతో కాంగ్రెస్ శ్రేణుల శవయాత్ర

**ప్రజాపక్షం/మరిపెడ:** తెలంగాణ అసెంబ్లీ స్పికర్ గడ్డం ప్రసాద్ కూమర్ పైన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు, స్పికర్ తల్లిని ఘెురంగా అవమానించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం మరిపెడ మండల కేంద్రంలో పట్టణ అధ్యక్షులు రాంలాల్ అధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు తాత మధు దిష్టిబోమ్మతో శవయాత్ర నిర్వాహించారు. అనంతరం అయన దిష్టిబోమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకోని దిష్టిబోమ్మను స్వాదీనం చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లడుతూ ఫాంహౌజ్‌లో ఒక రోజు ముందె కెసిఆర్ చేసిన ప్రణాళికలో భాగంగా బిఆర్ఎస్ గుండా లు స్లోగన్లు కలిగిన నల్ల టిషర్టులు ధరించి, ప్రోటోకాల్ ఉల్లంగణకు పాల్పడి అసెంబ్లీలోకి వెళ్ళడానికి ప్రయత్నిస్తే, అడ్డుకున్నా పోలీసులపైన దాడి చేయడమే కాకుండా రాజ్యాంగ పదవిలో వున్న శాసనసభ స్పీకర్,దళితనాయకుడు అయిన గడ్డం ప్రసాద్ కూమర్ ను అత్యంత ఘెూరంగా దుషించి అయన తల్లిని అవమానించి క్షమించరానటువంటి తప్పు చేశరని,హరిష్ రావు,కెటిఆర్ పోలీసులపైనే దాడి చేశారని,హరిష్ రావు మహిళ అధికారుల ముందే టిషర్టు విప్పి అర్ధ నగ్న ప్రదర్శన చేయడం దారునమని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నా అభివృద్దిని చుసి ఓర్వలేక అహంకార దోరణితో అధికారనికి దూరమై సైకోలుగా మారిన బిఆర్ఎస్ నాయకులపైన ఎస్సీ ఎస్టి అట్రాసిటి కేసులు నమోదు చేయలనీ,శాసనసభ సభ్యత్వం రద్దు చేసి భర్తరఫ్ చేయలనీ,లేనట్లయితే



కాంగ్రెస్ పార్టి అధ్వర్యంలో తీవ్ర అందోళనలు చేపడతామని హెచ్చారించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యుగేందర్ రెడ్డి, నియెజకవర్గ ఇంచార్జ్ అవేజ్‌ఖాన్, పట్టణ అధ్యక్షులు రాంలాల్, వైస్ చైర్మన్ సునితరవిందర్ రెడ్డి, తాజుద్దీన్, అయిలమల్లు, అంబరీష, కౌన్సిలర్లు, కోఅఫ్షన్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

## జనగామలో బిఆర్ఎస్ ఆందోళనలు

**ప్రజాపక్షం/జనగామ:** ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి చీరలాగడాన్ని నిరిసిస్తూ మంగళవారం జనగామలో బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ర్యాలీగా చౌరస్తాకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు సమర్పించారు. మహిళలు నిరసనకు దిగారు. మిగతా నాయకులు సైతం నినాదాలు చేస్తూ రేవంత్‌రెడ్డి గద్దె దిగిపో.. సిగ్గు చేటు సిఎం పాలన అంటు నినదించారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తులను చీరలాగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు గుండాయిజం చేస్తున్నారని, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ లోపలకు వెళ్లనీయడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి క్షమాపన చెప్పకుంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, పోకల జమున, బండ పద్మ, వాంకుడోతు అనిత, పట్టణ అధ్యక్షులు

## వృద్ధుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**ప్రజాపక్షం/జనగామటౌన్:** వృద్దుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్దతో పనిచేస్తుందని, ఇందులో భాగమే ప్రణామ్ వయోవృద్దుల డే కేర్ సెంటర్ల నిర్వహణ అని ఇండియన రెడ్ క్రాస్ సొసైటీ జనగామ చైర్మన్ డా. డి లవకుమార్ రెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్సక్లబ్ జనగామ ఆబాద్ ఆధ్వర్యంలో ఒమేగా హాస్పిటల్స్ హైధరాబాద్ సౌజన్యంతో ప్రణామ్ వయోవృద్దుల డే కేర్ సెంటర్‌లో మంగళవారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్య పరీక్ష శిబిరం, అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పరుశరాములు, డా. నాగూర్, డా. సుదీప్, పీఆర్‌వో ప్రవీణ్ కుమార్, శ్రవణ్, వీరయ్య, పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశానుసారం దేవరుప్పుల ప్రధాన చౌరస్తాలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సుందర్, బిక్షపతి, జలంధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు, మండల సీనియర్ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

## మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వ తీరు దారుణం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం తీరు అత్యంత దారుణమని వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలుకై సెప్టెంబర్ 2 నుంచి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో చివరి రోజులో భాగంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.అనంతరం అంబేద్కర్ సెంటర్ నుండి జయశంకర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను అడ్డుకున్న తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహ



రించిన తీరు హేయమైనచర్య, మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే వారిపై పోలీసులతో దాడులు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ వెంకటరాణి సిద్ధు, టిఆర్ఎస్ నాయకులు కటకం జనార్ధన్, మేకల సంపత్ కుమార్, గండ్ర హరీష్ రెడ్డి, మాడ హరీష్ రెడ్డి, కౌన్సిలర్లు వేషాల రాజు, పూర్ణం, మాజీ కౌన్సిలర్ లు మహిళ నాయకురాలు ఎడ్ల మౌనిక, పిల్లలమర్రి శారద, తిరుపతమ్మ పూలమ్మ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బేటీ బచావో బేటీ పడావో

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** బాలికల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు చిన్ననాటి నుంచే పౌష్టికాహారం అందించడం ఎంతో అవసరమని సూపర్‌వైజర్ సునీత వీణ అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండలం నాగారం గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా సంక్షేమ అధికారిణి సూచనలతో, సూపర్‌వైజర్ సునీత వీణ ఆధ్వర్యంలో డి హెచ్ ఈ డబ్ల్యూ ద్వారా బాలికలు, మహిళలు, చిన్నారుల పోషణ, ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ సునీత మహిళలు, బాలికల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు చిన్ననాటి నుంచే పౌష్టికాహారం అందించడం ఎంతో అవసరమన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కిశోర బాలికల కోసం ప్రభుత్వం ఇస్తున్న చిక్కిల గురించి వివరించారు. సఖి కేంద్రం కౌన్సిలర్ మాధవి గారు మాట్లాడుతూ సఖి సేవల గురించి, 181 హెల్ప్ లైన్ నెంబర్ గురించి ,మహిళలకు ప్రభుత్వం అందించే సేవల గురించి, వరకట్న, గృహ



హింస, బాధిత మహిళల కోసం 24X7 సఖి సేవలు అందిస్తుందని 5 రోజుల పాటు ఉచితంగా సఖి లో వైద్య,న్యాయ, తెలిపారు.జెండర్ స్పెషలిస్ట్ అనూష అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహారం అందించే కేంద్రాలుగా మాత్రమే కాకుండా బాలికల ఆరోగ్యం, హక్కులు, విద్య, భద్రత మరియు సాధికారతకు మార్గదర్శక కేంద్రాలుగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో మిషన్ కోఆర్డినేటర్ క్రిష్ణ, జెండర్ స్పెషలిస్టు మమత, అంగన్‌వాడీ టీచర్లు, స్వర్ణలత,సరిత,రజితలు గ్రామ ప్రజలు, గర్భిణీలు, బాలింతలు మరియు బాలికలు పాల్గొన్నారు.

## దోపిడీ లేని సమాజం కోసం పోరాడాలి

**ప్రజాపక్షం/మరిపెడ:** కేంద్ర ప్రభుత్వ,పెట్టుబడిదారుల దోపిడి విధానాల కారణంగా 140 కోట్ల ప్రజల సంపద కోల్లగోట్టబడి 300 మంది పెట్టుబడిదారుల వద్ద పోగుపడిందనీ,ప్రజల అర్థిక అసమానతలు పోవాలంటే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నా ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కోట్టాలనీ సిపిఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు అలువాలా వీరయ్య పిలుపునిచ్చారు.మంగళవారం పార్టి మండల స్థాయి ఓక రోజు రాజకీయ శిక్షణ తరగతులు మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ అధ్యక్షతన మండల పరిధిలోని అబ్బాయిపాలేంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ముందుగా పార్టి జెండాను నాయకులు ఎర్ర వెంకన్న అవిష్కరించగా,ముఖ్య అతిధి వీరయ్య శిక్షణ తరగతులు ప్రారంభించి మాట్లడుతూ,కేంద్ర ప్రభుత్వ నల్ల చట్టలతో కార్మికులకు,రైతులకు ఉద్యోగ ఉపాధి రంగలలో తీవ్ర నష్టం జరుగుతుందనీ,80 శాతం వ్యవసాయ రంగం పైన అధరపడి జీవించే కార్మికుల బ్రతుకులు ప్రభుత్వ విధానాల మూలంగా దుర్బరమ




వుతున్నాయని ఆయన అవెదన వ్యక్తం చేశారు.పాలకుల ప్రజవ్యతిరేక విధానాలు ప్రజలకు వివరించడానికి ఈ క్లాసులు ఉపాయెగపడతాయని అన్నారు.కార్యకర్తలు గ్రామగ్రామన ప్రజలను చైతన్య వంతులను చెయ్యలనీ పిలుపు నిచ్చారు.ఖమ్మం సిపిఎం నాయకులు,స్టడిసర్కిల్ ఇంచార్జ్ బోడపట్ల రవిందర్ మతం,మతతత్వం అనే అంశలపైన తరగతులు భోదించారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు జిన్నా లచ్చన్న,కోండ ఉప్పలయ్య,బోడపట్ల రాజశేఖర్, మమత, వార్డు సభ్యులు నందిపాటి ఉప్పలమ్మ, శ్రీనివాస్ రెడ్డి, రాంముర్తి,కె వెంకన్న,పాల్గోన్నారు.

## ఈనాడు ప్రతిభ పాటవ పోటీల్లో బాలాజీ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/ములుగుః** జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రథమ బహుమతిని 9వ తరగతి విద్యార్థిని పోరిక శ్రీ తన్విత, ద్వితీయ బహుమతిని 9వ తరగతి విద్యార్థిని సామల అక్షయ, తృతీయ బహుమతిని 10వ తరగతి విద్యార్థి ధరావత్ అద్విక్‌లు సాధించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ముజీబ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహమ్మద్ ముజీద్ మాట్లాడుతూ స్వయంకృషి, పట్టుదల, జిజ్ఞాస ఉంటే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుకృత, పూర్ణేందర్, శ్రీకాంత్, రవికుమార్, దిలీప్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి టీకాపై విద్యార్థులకు అవగహన

**ప్రజాపక్షం/మరిపెడ:** మరిపెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా మంగళవారం ఇంచార్జ ప్రధనోపద్యాయులు నందిగామ జనార్ధనాచారి అధ్యక్షతన హెచ్ పివి వ్యాక్సిన్‌పై విద్యార్థులకు ప్రత్యేక అవగహన కార్యక్రమం నిర్వాహించారు.ఈ సమావేశంలో వైద్యా సిబ్బాందితో కలసి జనార్ధనాచారి మాట్లడుతు మహిళల్లో వచ్చె గర్బశయ ముఖద్వారా క్యాన్సర్ బారిన పడకుండా ఉండాటనికి కౌమర దశలో హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవాడం అత్యంత కీలకమని,14,15 సం.ల బాలికలకు ఈ టీకా ఇవ్వడం ద్వారా శరీరంలో బలమైన రోగనిరోదక శక్తి ఎర్పడి భవిష్యత్ లో వచ్చె క్యాన్సర్ ముప్పును నివారించవచ్చునని వివరించారు.ఈ టీకా పూర్తిగా సురక్షితమైనదని,ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు.బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు,పౌష్టికాహారం తీసుకోవాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బాంది మంగమ్మ, ఆచార్యులు, నాగమణి, అనసుర్య, టిచర్లు స్వప్న, శౌరి, అనిత, సుధ, విద్యార్థినిలు, పాల్గోన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సిఐ రవికుమార్ కు సన్మానం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గత అనేక సంవత్సరాలుగా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ జాతీయులు,జాతి నిరంతర శ్రేయోభిలాషులు తొగిటి రవికుమార్ ఇటీవల వరంగల్,జనగాం జిల్లాల మహిళా పోలీస్ స్టేషన్లకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం,విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్ లో ఘనంగా సత్కరించారు. రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని నాయకులు అభిప్రాయపడ్డారు. జాతీయుల సమస్యలలో చేయూత నివ్వాలని రవికుమార్ ను కోరగా తప్పకుండా సహకారం అందిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, హనుమకొండ జిల్లా సంఘం అధ్యక్షులు అలుగోజు కృష్ణమూర్తి, వీరన్న,గ్రేటర్ వరంగల్ సంఘం ప్రధాన కార్యదర్శి మహారాజ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయాలి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేటు బయట రాజ్యాంగ పదవిలో ఉన్న అత్యున్నత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి అమర్యాదగా ప్రవర్తించిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలను వెంటనే సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. పెద్దల సభలో ఉన్న సభ్యులు ఇలా మాట్లాడడం హుందా తనం కాదని,వారిలో రాజకీయ పరిజ్ఞానం లేని లోటు కనిపిస్తున్నదని ఆయన ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటన జరగకుండా శాసనమండలి స్పీకర్ వెంటనే వార్ సభ్యత్వం రద్దు చేయాలని ఆయన కోరారు. దళితుడు కావడమే స్పీకర్ చేసిన పాపమా అని ఆయన అన్నారు. ఎమ్మెల్సీలను టిఆర్ఎస్ అధిష్టానం పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సిందిగా ఆయన కోరారు.ఎంతటి వారైనా కనీసం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విలువల్ని కాపాడుకునే నాయకులు ఉండాలని ఆయన కోరారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి

ప్రజాపక్షం/జగదేవపూర్: పేదోళ్ల పెన్నిధి మహా బాబునగర్ సింహం పండగ సాయన్న జయంతిని జగదేవ్‌పూర్‌లో శనివారం ముధిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి సంఘం నేతలు నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పని చేస్తామని అన్నారు.

## తాత మధు వెంటనే రాజీనామా చేయాలి..

ప్రజాపక్షం/బెజ్జంకి : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు లింగాల శ్రీనివాస్ అన్నారు.స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాత మధు అసభ్య పదజాలంతో అవమానించే విధంగా మాట్లాడిన మాటలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ శ్రేణులు డప్పు చప్పుళ్ళతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం దళిత వ్యతిరేకి కేసీఆర్ రాజీనామ చేయాలని మండలం నుండి ఫామ్ హౌజ్ ముట్టడికి తరలివెళ్ళారు.కార్యక్రమంలో పీఏసీఎస్ ఒగ్గు దామోదర్,ఏఎంసీ చైర్మెన్ పులి కృష్ణ,మాజీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి,సర్పంచుల ఫోరం మండలధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్,అక్కరవేని పోచయ్య,బైర సంతోష్,ఆయా గ్రామాల పార్టీ ప్రజా సంఘాల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్దం..

ప్రజాపక్షం/బెజ్జంకి : అసెంబ్లీలో మహిళా ఎంఎల్ఏల పై జరిగిన అసభ్య ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై బీఆర్ఎస్ మండల సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్దం చేశారు.అనంతరం ఈ సంధర్భంగా పార్టీ మండలాధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ మహిళా ఎంఎల్ఏల గౌరవాన్ని కాపాడవలసిన భాధ్యత ప్రభుత్వంపై ఉందని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భాధ్యులపై తక్షనమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రావుల రామకృష్ణారెడ్డి, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, ఎల శేఖర్ బాబు, రాజయ్య, అనీల్, బాబు, నరేష్, సురేష్, మొండయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి..

ప్రజాపక్షం/బెజ్జంకి : క్రిమిసంహారక మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వడ్లూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు తుమ్మ తేజ (23) ఈ నెల 4న ఇంట్లో ఎవరు లేని సమయంలో క్రిమిసంహారక మందు సేవించి వాంతులు చేసుకుంటుండగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.మృతురాలి తండ్రి తుమ్మ కొమురయ్య ఇచ్చిన ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.తిరుపతి తెలిపారు.

# కెసిఆర్ కు ఏమైనా జరిగితే...రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తాం



ప్రజాపక్షం/గజ్వేల్ : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఏమైనా జరిగితే రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. సింగాయపల్లి రాజీవ్ రహదారిపై బి శ్రేణులతో కలిసి ధర్నా, రాస్తా రోకో నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హామీలు గుప్పించగా, వాటిని అమలు చేయలేకనే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇచ్చిన హామీల కోసం వేలాది దబ్బులతో ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న రేవంత్ రెడ్డి రాష్ట్ర చరిత్రలో దుర్మార్గపు సీఎంగా నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. చావు రాజకీయాలు చేయకుండా దమ్ముంటే కేసీఆర్ చేసిన అభివృద్ధిలో పోటీపడాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు ఎస్కార్ట్ తో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎర్రవల్లి ప్రాంతానికి తరలివచ్చినట్లు ఆరోపించారు. కెసిఆర్ ఫామ్ హౌజ్ పై దాడికి ప్రయత్నించిన వారిని అరెస్టు చేయాల్సింది పోయి, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు అరెస్టులు చేసి నిర్బంధించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పునరావృతమైతే కాంగ్రెస్ నేతలను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు వేలూరి వెంకటరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు దేవగనిక నాగరాజు, నేతలు రమేష్ గౌడ్, బాల్రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్ రెడ్డి కృష్ణారెడ్డి, గంగిశెట్టి రవి, సత్యనారాయణ గౌడ్, బాబుల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ప్రజాపక్షం/ సిద్దిపేట : శాసనసభ సమావేశాలకు వెళుతున్న మహిళ ఎమ్మెల్యేల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని సిద్దిపేట జిల్లా మాజీ జెడ్పీ చైర్పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. శాసనసభ సమావేశాలకు వెళ్తున్న మహిళల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు కు వ్యతిరేకంగా సిద్దిపేటలో బి.ఆర్.ఎస్ మహిళా విభాగం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు.సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టగా హౌసింగ్ బోర్డు కమాన్ వద్దకు రాగానే పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో మహిళా నాయకులు అందరూ రోడ్డుపైనే బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్స్ తో



కలిసి రోజా రాధాకృష్ణశర్మ మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించేందుకు అక్రమ అరెస్టులు చేయడం దారుణం అన్నారు. ప్రశ్నిస్తే అరెస్టులు అనే రకంగా తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని.... అది ప్రశ్నిస్తున్నందుకే మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం దురుసుగా ప్రవర్తిస్తుందని మండిపడ్డారు.

# వందరోజుల్లో హామీలు అమలు వెయ్యి రోజులైనా ప్రజలకు చేసింది ఏమిలేదు



ప్రజాపక్షం/ సిద్దిపేట : వందరోజుల్లో ఇచ్చిన హామీలు అన్నింటిని నెరవేరుస్తామని బూటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్..... వెయ్యి రోజులు దాటినా ప్రజలకు చేసింది ఏమీ లేదని మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, సీనియర్ నాయకులు గుండు భూపేష్, పాల సాయిరాంలు అంబేద్కర్ విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడారు. 1000 రోజుల కాంగ్రెస్ పార్టీ పరిపాలన వైఫల్యాలను ప్రజల ముందు ఉంచాలని ఉద్దేశంతో వారం రోజుల నిరసన కార్యక్రమాలలో భాగంగా సిద్దిపేటలో బి ఆర్ ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నిస్తే అరెస్టులు, అడిగితే అడ్డగింపులు అన్న విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు.

# చొక్కాలు విప్పి వీధి రాజకీయాలా

### శాసనసభ గౌరవాన్ని దిగజార్చిన బీఆర్ఎస్ నేతల తీరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ ఫైర్



ప్రజా పక్షం/కొమురవెల్లి : కొమురవెల్లి తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి, తెలంగాణ సమాజానికి తలవంపులు తెచ్చేలా ఉందని కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిరసన పేరుతో మహిళా అధికారుల సమక్షంలో చొక్కాలు విప్పి అనుచితంగా ప్రవర్తించడం, అధికారులతో ఘర్షణకు దిగడం, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై వ్యక్తిగతంగా, కులపరంగా అవమానకర వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు. స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వలేని బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని శ్రీనివాస్ అన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ద్వారా బీఆర్ఎస్ నాయకులు తమ అసలు వైఖరిని బయటపెట్టుకున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా పోరాడాల్సిన ప్రతిపక్షం చౌకబారు రాజకీయాలు, వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు అనుచిత విధానాలను విడిచిపెట్టి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని మహదేవుని శ్రీనివాస్ హెచ్చరించారు. తెలంగాణ శాసనసభ గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని, రాజ్యాంగ వ్యవస్థలను అవమానించే చర్యలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరని ఆయన స్పష్టం చేశారు.

## మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి పరామర్శ

ప్రజాపక్షం/గజ్వేల్ : ఎర్రవల్లి ఫాంహౌజ్ సమీపంలో జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ తదితరులు మంగళవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు వారు సూచించారు. కాగా నర్సారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పిసిసి చీఫ్, మంత్రులు ఆసుపత్రి వైద్యుల నుండి ఆరా తీయగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వారు వివరించారు.

## తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలి



ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని, స్పీకర్‌కు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ధూళిమిట్ట మండల కేంద్రంలో దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తుషాలపురం రాజు, ఎంఆర్‌పిఎస్ నాయకులు సుందరగిరి భాస్కర్, మలమహానాడు నాయకులు సుద్దాల నర్సింహులు పాల్గొని మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులపై కులం, మతం, ప్రాంతం పేరుతో అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు వివిధ హోదాల్లో ఉన్న దళిత బహుజనులను అవమానించే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, అనుచిత వ్యాఖలు చేయడం, వికృత పదజాలంతో కించపరిచే సంస్కృతికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. దళిత బహుజనులు ఐక్యంగా ఉంటే అగ్రకుల ఆధిపత్య ధోరణులకు తావుండదని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు వార్డు సభ్యులు పోతరాజు కనుకయ్య, మన్నేరాజేందర్, మాజీ ఉప సర్పంచ్ నాచగోని నరహరి, కాగ్రెస్ పార్టీ నాయకులు రాజు, కుల సంఘాల, యువజన సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 420 హామీలపై ప్రశ్నిస్తే అరెస్టులా..!

ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట : ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు.. 6గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల్ని మహిళలను యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంను ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సిగ్గుచేటు అని, ఉమ్మడి మద్దూరు మండల మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, యూత్ నాయకులు బడుగు సాయిలు, ధూళిమిట్ట మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చొప్పరి సాగర్‌లు వేరువేరుగా పేర్కొన్నారు. ఎర్రవల్లి ఫామ్ హౌజ్ ముట్టడి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చిన సందర్భంలో గులాబా బాస్ రక్షనకు ఉమ్మడి మద్దూరు, ధూళిమిట్ట మండలాల తరఫున బిఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. దీనిపై ముందస్తుగా జాలపల్లి గ్రామ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చొప్పరి సాగర్‌ను ఇంటివద్దనే మద్దూరు పోలీస్‌లు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

ప్రజాపక్షం/వెల్దుర్తి : ఫామ్ హౌస్ వద్ద ఉద్రిక్తత నేపథ్యంలో మెదక్ జిల్లా వెల్దుర్తి లో బిఆర్ఎస్ జిల్లా నాయకులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలను అడ్డుపెట్టి తెలంగాణ తెచ్చిన నాయకుడు ఇంటి వద్ద కాంగ్రెస్ నాయకులు డ్రామాలు చేస్తున్నారని వారు తీవ్రంగా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల చరమగీతం పాడుతారని వారు తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కృష్ణ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జగ్గ అశోక్ గౌడ్, శ్రవణ్ కుమార్, నెల్లూరు సర్పంచ్ హస్తాల్పూర్ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్సి కేంద్రాల ద్వారా ఫర్టిలైజర్ బుకింగ్

**ప్రజాపక్షం/రేగోడు:** ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి ఫర్టిలైజర్ సిఎస్సి కేంద్రాల ద్వారా రైతులు బుకింగ్ చేసుకోవచ్చని సిఎస్సి జిల్లా మేనేజర్ రాజు అన్నారు మంగళవారం రేగోడ్ సిఎస్సికేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భగామాట్లాడుతూ జిల్లా లోని ఫర్టిలైజర్ దుకాణాలో నిలువ ఉన్న మందులను ఆధార్ నెంబర్ ఓటిపి ఆధారంగా బుక్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు గోవింద్ జైన్ ఆపరేటర్లు రాములు అనుదీప్ తదితరులు ఉన్నారు

## పోచయ్య మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి



**ప్రజాపక్షం / మెదక్ :** మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన పోచయ్య ఆత్మహత్య ఘటనపై తెలంగాణ రక్షణ సేన పార్టీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యుల ఆరోపణల నేపథ్యంలో ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పార్టీ డిమాండ్ చేసింది.
పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సూచనల మేరకు మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ సోమవారం పాతూరు గ్రామానికి వెళ్లి పోచయ్య కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కవిత సైతం కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని, అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఘటనకు బాధ్యులెవరైనా ఉంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కాశాపురం అశోక్, వేపూరి శ్రీనివాస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న మాజీ ఎమ్మెల్సీ అరెస్ట్



**ప్రజాపక్షం / మెదక్ :** ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు బయలుదేరిన మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు షేరి సుభాష్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి ములుగు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనను ఎలాంటి కారణం లేకుండా అక్రమంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.
కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న సమయంలో పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై నిర్బంధాలు, అరెస్టులకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యక్రమాలకు హాజరయ్యే హక్కును కాలరాస్తున్నారని విమర్శించారు.

# కెసిఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి ఉద్రిక్తం

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మాజీ సిఎం కెసిఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి నేపథ్యంలో మర్కూక్ మండలంలో సోమవారం పోటాపోటీ నిరసనలు దిష్టి బొమ్మల దగ్ధంతో ఉద్రిక్తత నెలకొంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వాఖ్యలకు నిరసనగా ఎస్సీ సెల్ పిలుపు మేరకు రాష్ట్ర నలుమూలల నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి బయలుదేరగా, వారిని పోలీసులు వార్గమధ్యలోనే అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి చావుడప్పులు కొడుతూ కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో బిఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఎదురు నిరసనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఇరువర్గాల మధ్య బారీకేడ్లు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం ఇరుపార్టీల కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకోని జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లకు తరలించారు. కాగా కెసి



ఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి సరిహదు మండలాల నుండి కాన్వాయి ద్వారా వస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను మర్కూక్ మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో బిఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకొని రాళ్లు, కర్రలతో కాన్వాయిపై దాడికి దిగారు. ఈ ఘర్షణలో కాన్వాయిలోని కొన్ని కార్ల అద్దలు పగిలిపోగా ఇరువర్గాల మధ్య కొద్ది సేపు యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ సమాచారం అందుకున్న పోలీసు బలగాలు అక్కడకు చేరుకోని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# అధికారులు సమావేశానికి హాజరు కావాల్సిందే..




**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సర్వసభ్య సమావేశాలు,ప్రజావాణి నిర్వహించే సందర్భంలో సంబంధిత శాఖ అధికారులు తప్పకుండా హాజరు కావాల్సిందేనని అప్పుడే ప్రజా సమస్యలు తెలుస్తాయని అర్బన్ మండల స్పెషల్ ఆఫీసర్ ఎడిఎ పద్మ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండల సర్వసభ్య సమావేశంకు హాజరై ఆమె మాట్లాడారు. చాలామంది అధికారులు సమావేశాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అంశం తమ దృష్టికి వచ్చిందని ఆ శాఖకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటే ప్రతి అధికారి సమావేశాలకు రావాలని సూచించారు. అనంతరం నోడల్ అధికారి ఎంపిడిఓ మార్టిన్ లూథర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి పరిష్కరించుకోవడానికి నిర్వహించే సమావేశాలకు అధికారులు హాజరు కాకపోవడం మంచిది కాదని ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎన్సాన్‌పల్లి గ్రామ సర్పంచ్ స్రవంతి మాట్లాడుతూ సర్దార్ పాపన్న విగ్రహం నుండి గ్రామం వరకు రోడ్డు డివైడర్‌పై నాటిన మొక్కలకు సుడా అధికారులు నీళ్లు పట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించుస్తున్నారని ఆరోపించారు. మిట్టపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సుడా అధికారులు ఏ సమావేశాలకు హాజరు కావడం లేదని వారు వస్తేనే చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు.

# ముట్రాజ్‌పల్లిలో మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి గ్రామంలో రోటరీ క్లబ్ జూబ్లీ హిల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక సర్పంచ్ సాలె పద్మ వెంకటేశం, జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ చైర్మన్ చక్రవర్తి రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు.




ముట్రాజ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మేడిసిటీ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, ఈఎన్‌టీ, యూరాలజీ, ఆప్తాల్మాలజీ, పీడియాట్రిక్ తదితర విభాగాల వైద్యులు సేవలందించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు మేడిసిటీ ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహించడంతో పాటు కళ్లద్దాలు కూడా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల కోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కౌడిపల్లి మండలంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు దూరాన్ని బట్టి త్వరలో ఉచిత సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ చైర్మన్ చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని పెంపొందించుకుని, భవిష్యత్తులో మంచి స్థానాలకు చేరిన తర్వాత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు అభిషేక్, మేడిసిటీ ఆసుపత్రి సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** అసెంబ్లీ ఆవరణలో బిఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేలపై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు భారీ నిరసన ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి మహిళా ఎమ్మెల్యేలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని మహిళలు డిమాండ్ చేశారు. మహిళలు చేపట్టిన భారీ నిరసన కార్యక్రమం వల్ల ఎక్కడి వాహనాలు అక్కడే స్తంభించిపోయి ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న సీఐ రంగకృష్ణ, ఎస్సై రంజిత్ రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని ధర్నాను చెదరగొట్టి ట్రాఫిక్ సమస్యను తీర్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, మాజీ జెడ్పి కోఆప్షన్ నెంబర్ మన్సూర్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ మండల అధ్యక్షుడు మాజీ నర్సింలు, జెడ్పిటిసి బాబ్యా మండల అధ్యక్షులు చంద్రశేఖర్, సత్యం గౌడ్, సర్పంచులు వర్ష సుదీప్, తుల్చమ్మ బిక్షపతి, సునీత రాముల నాయక్, గేమ్ నాయక్, మాజీ సర్పంచులు, ఉమ్లి నాయక్ సౌమ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర్ తోనే గ్రామాలు అభివృద్ధి జరిగింది

**ప్రజాపక్షం/రేగోడు:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతోనే రేగోడ్ మండల అన్ని విధాల అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దిగంబరావ్ అన్నారు మంగళవారం రేగోడ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్పీకర్ పై టిఆర్ ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు ఉచిత బస్సు ప్రయాణం రేషన్ కార్డుల ఉచిత విద్యుత్ సబ్సిడి గ్యాస్ రోడ్డు అభివృద్ధికి నిధుల మంజూరి చేయడం జరిగిందని అన్నారు మెదక్ జిల్లాలో చేర్చింది టిఆర్ఎస్ పార్టీ కలిపి ఎందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు మండల అభివృద్ధి పై రేగోడ్ గాంధీ చౌక్ వద్ద చర్చించేందుకు టిఆర్ ఎస్ నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ మున్నూరు కిషన్ మాజీ కోఆప్షన్ చోటు మియా జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పిర్యియనాయక్ వట్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాజిల్ సర్పంచులు సంగ్యినాయ్యక్ పండరి నాయకులు మల్లికార్జున్ శివరాజ్ బసవరాజ్ తదితరులు ఉన్నారు

## తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా పోటీలు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా పాపన్నపేటలో మండల స్థాయి లో ప్రాథమిక స్థాయి నుండి కళాశాల స్థాయి విద్యార్థుల కు చదవడం, రాయడం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా సభాధ్యక్షులు మహేశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ యాస లో గొప్పతనం ఉందని, మన భాష ను కాపాడుకోవాలని, పోటీల వల్ల విద్యార్థుల లో ప్రేరణ ఉంటుదని అన్నారు. మండల పరిధిలోని వివిధ పాఠశాల ల నుండి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలకు సమన్వయ కర్త గా అంజాగౌడ్ వ్యవహరించారు. చదవడం పోటీ లో సహస్ర (పొడిచన్ పల్లి )శ్రీవల్లి (గాజుల గూడెం)అక్షిత (ఎల్లాపూర్) శ్రీహి( కొంపల్లి)అరిద్య (కుర్తివా) రాయడం పోటీలో భావన (పొడిచన్ పల్లి) నిశాంత్ (దౌలా పూర్) వైష్ణవి (అరెపల్లి) మణి వర్షిత్ (ఎల్లాపూర్) కే.శ్రావ్య (శానాయి పల్లి) వ్యాస రచన పోటీలో నేహా (యూసుఫ్ పే) వైష్ణవి (పాపన్నపేట) సహస్ర (అన్నారం) కళా శాల విభాగం వ్యాస రచన పోటీలో ఆలేఖ్య ప్రథమ స్థానం, ,వైష్ణవి ద్వీతీయ స్థానం, శిరీష తృతీయ స్థానం పొందారు.

## శ్రీ నల్లపోచమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.8.63 లక్షలు

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** కౌడిపల్లి మండల పరిధిలోని తునికి గ్రామంలోని శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ.8,63,871 వచ్చినట్లు ఆలయ ఈఓ రంగారావు తెలిపారు. మంగళవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సిద్దిపేట విజయలక్ష్మి, ఆలయ ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ పూజారులు శివప్ప, రాజేష్, విగ్నేష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఐదు నెలల 12 రోజుల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని అధికారులు, పోలీసులు, శ్రీ లలిత సేవా సమితి హైదరాబాద్ ప్రతినిధులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. ఈ లెక్కింపులో మొత్తం రూ.8,63,871 ఆదాయం వచ్చినట్లు ఈఓ రంగారావు వెల్లడించారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవాదాయ శాఖ బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు.

## బివిఆర్ఐటి లో రాక్ బాల్ జాతీయ ఛాంపియన్‌షిప్ ముగింపు

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ ఐటి కళాశాలలో అజయ్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ నిర్వహించిన 10వ సీనియర్ నేషనల్ మరియు 7వ సీనియర్ మిక్స్ నేషనల్ రాక్ బాల్ ఛాంపియన్‌షిప్ ఘనంగా ముగిశాయి. సీనియర్ బాయ్స్ విభాగంలో హర్యానా జట్టు విజేతగా, ఉత్తరప్రదేశ్ రన్నరప్‌గా నిలిచింది. మిక్స్ సీనియర్ విభాగంలో హర్యానా విజేతగా, తెలంగాణ రన్నరప్‌గా నిలిచింది. ఉమెన్స్ విభాగంలో హర్యానా విజేతగా, ఛత్తీస్‌గఢ్ రన్నరప్‌గా నిలిచాయి. ఈ ముగింపు కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సువాసన రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ రాజమణి యాదవ్, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సాయికుమార్, బీజేపీ నాయకులు రఘువీరా రెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాస్, సీఐ రంగకృష్ణ, ఎస్ఐ రంజిత్ రెడ్డి, బివిఆర్ ఐటి కళాశాల మేనేజర్ బాపిరాజు తదితరులు హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

## ఏమి అభివృద్ధి చేశారని సంబరాలు

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏమీ అభివృద్ధి సాధించారని సంబరాలు జరుపుకుంటున్నారని బిజెపి జిల్లా అధ్యక్షు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఏదేవా చేశారు. మంగళవారం నర్సాపూర్ లోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, 22ఎ జీవో సమస్యలపై శాంతియుతంగా నిరసన చేపడుతుంటే రాష్ట్ర అధ్యక్షులు అని చూడకుండా విచక్షణారహితంగా రామచంద్రరావు ను పోలీసులు అరెస్టు చేయడం ఇంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిందని వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా అందరూ ఏకమై వారి సొంత వాహనాలకు డీజిల్ పోయించుకుంటూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి సంఘసాని సురేష్. బిజెపి ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు రాములు నాయక్, మండల పార్టీ అధ్యక్షులు నీలి నాగేష్, బిజెపి జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, పట్టణ కన్వీనర్ ప్రేమ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసం శరీర దారుఢ్యానికి దోహదపం

**ప్రజాపక్షం/అల్లదుర్గం :** మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఎంపీడీవో వేద ప్రకాశ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మద్దూరి సౌమ్య సురేష్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, వారి మానసిక ఉల్లాసం శరీర దారుఢ్యం ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడా పోటీలను విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వారు సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల సేవలందించాలి

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** మండల కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల వైద్య సేవలు అందించాలని బిఆర్ఎస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో తహసిల్దార్ మల్లయ్య ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలం చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలకు అకస్మాత్తుగా వచ్చే వ్యాధులకు దావకానకు వెళ్లాలంటే 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న జోగిపేట వెళ్ళవలసి వస్తుందని మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటల వైద్య సేవలు అందిస్తే ప్రజలకు ఏ ఆపద వచ్చిన అందుబాటులో ఉంటుందని ఎల్లవేళల వైద్య సేవలు అందే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివరాం రాథోడ్, రాంజీ నాయక్, సంతోష్ నాయక్ తదితరులున్నారు.

## సొంత గూటికి నీరడి అంజనేయులు

**ప్రజాపక్షం/ కొండాపూర్ :** కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీరడి అంజనేయులు తొందర పాటుతో కాంగ్రెస్ పార్టీ ని వీడి గత రెండు నెలల క్రితం తీన్మార్ మల్లన్న సమక్షంలో టీఆర్పి పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీని వదిలి ఉండలేక కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడై మంగళవారం టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సమక్షంలో సొంతగూడు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి అంజనేయులు కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై ప్రభు, మాజీ ఎంపిటీసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పోచమ్మ దుర్గమ్మ బోనాలు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** మండల పరిదిలోని బ్రాహ్మణపల్లి గ్రామంల నూతనంగా నిర్మించిన పోచమ్మ, దుర్గమ్మ ఆలయాలకు ప్రతిష్ట చేసి బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతరాజులు ,జోగినీలు శివసత్తులు, ఊరేగింపు కనుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాజీ సర్పంచ్ ఉపసర్పంచులు వాట్సప్ లు గ్రామ ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

# పటాన్‌చెరులో కదం తొక్కిన గులాబీ దండు

**ప్రజాపక్షం /పటాన్‌చెరు :** ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ మహిపాల్ రెడ్డి నేతృత్వంలో పటాన్‌చెరు లో కదం గులాబీ దండు తొక్కారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తు పటాన్‌చెరు పట్టణ వేదికగా బీఆర్ఎస్ మహిళా శ్రేణులు,బారీ అందోళన చేపట్టాయి. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అదేశాల మేరకు ఆయన సతీమణ గూడెం యాదమ్మ ,మహిపాల్ రెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై మహిళా నాయకులు,కార్యకర్తలు తీవ్రస్థాయిలో అగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతయుతంగానిరసన తెలుపుతున్న తమను కాంగ్రెస్ శ్రేణులు,అడ్డుకునేందుకు ప్రయత్నించాయని బీఆర్



ఎస్ నాయకులు ఆరోపించారు. బిఆర్ఎస్ మహిళా శాసన సభ్యులరాళ్లపై దాడి సిగ్గుచేటు అంటూ మహిళా శ్రేణులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మహిళల పట్ల దురుసుగా వ్యవహరించిన ప్రభుత్వ తీరును గమనిస్తున్నారని ప్రజల స్వామ్యంములో నిరసన తెలిపే హక్కును ఎవరూ అడ్డుకోలేరని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గూడెం యదమ్మ మహిపాల్ రెడి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బద్దంగా రాజ్యాంగం ఇచ్చిన హక్కును అనుగుణంగా తమ పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి శాంతి యుత నిరసన కార్యక్రమం చేపడుతుంటే అధికార కాంగ్రెస్ పార్టీ అడుకునేందుకు ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని దానిని సైతం అణగదొక్కేందుకు ప్రయత్నిస్తే తరమి కొడతామని హెచ్చరించారు. శాసన సభ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ మహిళా శాసన సభ్యులపై పోలీసులు దాడి చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. ఈ అంశాపై చర్యలు తీసుకోవల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధి పై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు పోరాలాలు కొత్త కాదని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చరమ గీతం పాడేంతవరకునిరంతర పోరాటాలు, చేస్తూనే ఉంటామని వారు హెచ్చరించారు.

# పటాన్‌చెరులో కాంగ్రెస్ నిరసన

**ప్రజాపక్షం /పటాన్‌చెరు :** దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన అహంకార పూరిత ,అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షరాలు '' కాట సుదా శ్రీనివాస్ గౌడ్'' ఆద్వర్యంలో పటాన్‌చెరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. పటాన్ చెరు డివిజన్ లోని గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలోపాల్గొని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వైఖరిపై ఖండిస్తూ నినాదాలు చేశారు. కాటా సుదారాణి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకరపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యం విలువలకు విరుద్ధమన్నారు. ప్రజాప్రతినిధులు, హుందాతనంతో వ్యవహరిస్తూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. దళిత స్పీకర్ అనుమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



రాజాంగ పదవులకు ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఉండేలా ప్రజా ప్రతినిధులు, బాద్యత యుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు, యువజన మహిలా నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## భావి భారత పౌరుల నిర్మాణ సారధులు ఉపాధ్యాయులే



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ఒక దేశ భవిష్యతు ఆ దేశపు తరగతి గదులలో రూపొందించబడుతుందని ఆ భవిష్యత్ సాదకులు ఉపాద్యాయులని వారి గురుతర భాధ్యత మరువ లేనిదని ముఖ్య అతిథి రీజయన్ చైర్మన్ లయిన్ గుమ్మడిదల వెంకన్న సెక్రటరీ లయన్ మంగళపర్తి వెంకటేశంలు అన్నారు. సర్వేపల్లి రాదాకృష్ణన్ జయంతిని పురస్కరించికొని పోతిరెడ్డి పల్లి లోని విద్యానగర్ కమ్యూనిటీ భవనం నందు లయిన్స్ క్లబ్ ఆప్ సంగారెడ్డి ఆదర్శ ఆద్వర్యంలో గురుపుజోత్సవమును నిర్వహించి 27 గురు ఉత్తమ ఉపాద్యాయులనను ఘనంగా సత్కరించారు. ప్రోగ్రామింగ్ చైర్మన్ లయిన్స్ శేషత్వం క్రిష్ణ, జులకంటి ప్రభాకర్ ల దాతృత్యముత నిర్విహించిన కార్యక్రమములో జి. వెంకన్న ,యం వేంకటేశములతో పాటు క్లబ్ అద్యక్షులు శంకరి విజయేంధర్ రెడ్డి, కో చైర్మన్ ,డి.హన్మత గౌడ్, డిస్ట్రిక్ చైర్మన్ నాయికోటి రామప్ప, పి రాంగోపాల్ , ఇతర బాద్యులు అనంతరావు కులకర్ణి ,పి.రామకృష్ణారెడ్డి ,టీ అల్లం రెడ్డి, ఏ లక్ష్మారెడ్డి, పి బస్వరాజ్, డి. రామ చంద్రం , జి. శ్రీదర్‌రెడ్డి , జి.భరతయ్య, యస్ ప్రకాశ్ ,యాంకర్,క్రిష్ణ ,ఆవార్డు గ్రహితలతో పాటు వివిధ పాఠశాలల ప్రదానోపాద్యాయులు ,ఉపాద్యాయులు కాలని ప్రజలు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలి

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఏడు రోజల నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంగారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

**మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరుపై ఆగ్రహం**

అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం పోలీసు అధికారులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించారు ప్రజల సమస్యలను ప్రసావించేందుకు అసెంబ్లీకి వచ్చిన ప్రజాప్రతినిదులపై నిర్బాదాలు, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య సూర్తికి విరుద్దమని మండిపడ్డారు. ప్రజా స్వామ్యంలో ప్రతి పక్షానికి మాట్లాడే హక్కు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందని ఆ హక్కులను అణచివేయాలని ప్రభుత్వా ప్రయత్నించడం సరికాదని అన్నారు.

**కేసీఆర్ వ్యాఖ్యలపై పోలీసులకు పిర్యాదు**

మాజీ ముఖ్యమంత్రి బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీరన్న పల్లి శంకర్, వేముల చేసినట్లు,ఆరోపిస్తున్న వ్యాఖ్యాలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సంబందిత ఎమ్మెల్యేలపై సుమోటోగాకేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

**రోడ్డుపై బైఠాయించి నిరసన నాయకులు అరెస్ట్**

అనంతరం బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు,రోడుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతరేకంగ నినాదాలు,చేస్తూ నిరసన చేపట్టారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలి హామీలు నెరవేర్చాల కాంగ్రెస్ ప్రభుత్వం డౌన్,డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చింతా సాయినాథ్ , మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**ప్రజాపక్షం/ కొండాపూర్ :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కొండాపూర్ పోలీసు స్టేషన్‌లో సీఐ సుమన్ కుమార్,ఎస్ఐ సోమేశ్వరి ఆద్వర్యంలో మంగళ వారం మండపాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఏలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సీఐ సుమన్ సూచించారు. పోలీసుల సూచనలు నిబందనలను ప్రతి ఒక్కరు తప్పని సరిగా పాటించాలని కోరారు.

## ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/ హత్నూర :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మరణిన్ని కోరడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలకు నిరసనగా సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పోలీసు స్టేషన్‌లో బిఆర్ఎస్ నాయకులు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ మానవత్వం లేకుండా మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శమన్నారు. ఒక ఎమ్మెల్యే హోదాలో ఉండి తెలంగాణ రాష్ట్ర సాధకుడు తొలి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మరణాన్ని కోరడం సిగ్గు మాలిన తనానికి నిదర్శమన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పిద్దాం

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 10వ తేదిన ఉదయం 10.30 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలో చాకలి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుద పోరాటంలో దైర్యసాహసాలతో పోరాడి, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప వీరనారి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ,అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని చాకలి ఐలమ్మ కు ఘన నివాళులు అర్పించాలని కలెక్టర్ కోరారు.